



వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి.. గురువారం పాలకొండలో పర్యటించారు. జెడ్‌పి మాజీ చైర్మన్ పాలవలస రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా పాలకొండలో జగన్‌కు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.
- ప్రజాశక్తి, పాలకొండ



డిఎస్‌సి కోసం గురజాడ కళాభారతి ఆడిటోరియం బయట చదువుతున్న నిరుద్యోగ అభ్యర్థులు

ఊరిస్తున్న డిఎస్‌సి

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఇదిగో అదిగో అంటూ కొద్ది నెలలుగా ప్రభుత్వం నిరుద్యోగులను ఊరిస్తోంది. పోస్టుల భర్తీకి డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రకటనలకే పరిమితమైంది. అధికారంలోకి వస్తే డిఎస్‌సి ఫైల్ పైనే తొలి సంతకం చేస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం సంతకం చేసినా అది కార్యాచరణకు మాత్రం నోచుకోలేదు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామంటూ చంద్రబాబు చెప్తుంటే, ఎమ్మెల్సీ ఎన్నికలు అయిపోయిన వెంటనే భర్తీ చేస్తామంటూ విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రకటిస్తున్నారు. జిల్లాలో ఎన్ని పోస్టులు ఉన్నాయో, ఎన్ని ఖాళీగా ఉన్నాయో ఇప్పటివరకు ఎటువంటి కసరత్తు జరగలేదని తెలుస్తోంది. నిరుద్యోగులు మాత్రం ఆశలు వదులుకోకుండా పుస్తకాలను ముందు వేసుకుని సాధన చేస్తునే ఉన్నారు.

- నోటిఫికేషన్ ఇదిగో, అదిగో .. అంటూ ప్రకటనలు
- కూటమి ప్రభుత్వం దాటవేత ధోరణి
- ఎనిమిది నెలల కిందటే ఫైల్‌పై సంతకం చేసిన సిఎం చంద్రబాబు
- జిల్లా నుంచి ప్రతిపాదనలే పంపని వైనం
- తీవ్ర నిరాశ, నిస్పృహలో నిరుద్యోగ అభ్యర్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 20 ప్రభుత్వ, ప్రైవేటు బిఇడి కళాశాలలు ఉన్నాయి. కోర్సు రెండేళ్ల కాలపరిమితి కావడంతో ప్రతి రెండేళ్లకు సుమారు 1000 మంది రిలీవ్ అవుతున్నారు. వీటితో పాటు 2 డిఇడి కళాశాలలు ఉన్నాయి. ఒక్కో కళాశాల నుంచి 50 మంది చొప్పున ప్రతి రెండేళ్లకు 400 మంది రిలీవ్ అవుతున్నారు. వీరు కాకుండా ఇప్పటికే బిఇడి, డిఇడి కోర్సులు పూర్తి చేసి ఉద్యోగాలు రాని వారు సుమారుగా 40 వేల మంది వరకు ఉన్నారు. టిడిపి హయాంలో 2018 అక్టోబరు 25న చివరిసారిగా నోటిఫికేషన్ వెలువడింది. ఆ తర్వాత ఉద్యోగ నియామకాలు జరగలేదు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో 2023లో డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామంటూ ఏడాది పాటు ఊరించి 2024 ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రభుత్వం, అధికారులు అంతా ఎన్నికల ప్రక్రియలో నిమగ్నం కావడంతో ఆ నోటిఫికేషన్ కథ ముగిసింది. మొత్తమ్మీద సుమారు ఏడేళ్లగా ఉద్యోగాలెర్తీ కాలేదు. దీంతో వేలాది మంది నిరుద్యోగులు డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తామని ప్రభుత్వం చెప్తున్నా, ఆ వైపుగా అడుగులు మాత్రం పడడం లేదు. నోటిఫికేషన్ కోసం జిల్లాల నుంచి వివరాలు సైతం తీసుకోలేదు. ఏడాదిన్నర కిందట అధికారులు పంపిన వివరాలు మినహా కొత్తగా ఏమీ పంపలేదు. దీంతో డిఎస్‌సి నోటిఫికేషన్ మాట ఉత్తదే అనే చర్చ సాగుతోంది.

ఏళ్ల తరబడి నిరుద్యోగుల సాధన

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డిఎస్ సి నోటిఫికేషన్ వస్తుందని నిరుద్యోగులు ఆశించారు. అంతా అనుకున్నట్లు గానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నోటిఫికేషన్ పై తొలి సంతకం చేసి మరింత ఆశలు రేపారు. జూన్‌లో సంతకం చేయడంతో ఆగస్టు, సెప్టెంబర్‌లో నైనా నోటిఫికేషన్ వస్తుందని ఆశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ప్రకటన విని అంతా తీవ్ర నిరాశకు లోనయ్యారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో ఆశల పై నీళ్ల చల్లినట్లు అయింది. విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం ఉమ్మడి జిల్లాల నుంచి వందలాది మంది అభ్యర్థులు విజయనగరంలోని పలు కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొంది ప్రస్తుతం రూములు అద్దెకు తీసుకొని ఏళ్ల తరబడి చదువతున్నారు. మరికొంత మంది కృష్ణా జిల్లా అవనిగడ్డలో శిక్షణ పొంది వచ్చి జిల్లా కేంద్రంలో ఉంటూ చదువుకుంటున్నారు. వీరంతా ఇళ్ల వద్ద, గ్రంథాలయాల వద్ద, పార్కుల్లోనూ డిఎస్‌సి కోసం సాధన సాగిస్తూనే ఉన్నారు. నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులకు ప్రభుత్వం ఏమి సమాధానం చెబుతుందో వేచి చూడాల్సిందే.

పెద్దఎత్తున ప్రచారం

డిఎస్‌సి నోటిఫికేషన్ పై ప్రభుత్వం టిడిపి నిరుద్యోగుల్లో ఆశలు రేపుతూనే ఉంది. జూన్‌లో ప్రారంభమయ్యే విద్యా సంవత్సరం నాటికి ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ చంద్రబాబు చెప్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నోటిఫికేషన్ ఇస్తామంటూ విద్యాశాఖ మంత్రి లోకేష్ చెప్తున్నారు. ఉద్యోగాలు భర్తీ చేయకపోయినా డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చామంటూ ప్రచారం చేసుకుంటోంది. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామంటూ కూటమి ప్రభుత్వం చెప్పుకుంటోంది. రాష్ట్రంలో ఉత్తరాంధ్ర జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండడంతో డిఎస్‌సి నోటిఫికేషన్ పైనే మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడుతున్న పరిస్థితి నెలకొంది. ఆచరణలో నోటిఫికేషన్‌పై మీనమీషాలు లెక్కిస్తున్నారు.

మూడేళ్లుగా ఎదురు చూస్తున్నా



డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం మూడేళ్లగా ఎదురు చూస్తున్నాను. 2022 నుంచి డిఎస్‌సి కోసం విజయనగరంలో అద్దెకు రూము తీసుకొని కోచింగ్ తీసుకొని చదువుకుంటున్నాను. ఇప్పటికే లక్షల రూపాయిలు ఖర్చు చేశాను. అయినా ప్రభుత్వం. డిఎస్‌సిపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం లేదు. వెంటనే డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

- పి.నాగరాజు, పాడేరు, ఎఎస్ఆర్ జిల్లా

పోస్టులపై స్పష్టత లేదు..



టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయ పోస్టులు 16 వేలకు పైగా భర్తీ చేస్తామని ప్రకటించింది తప్ప ఏ పోస్టులు ఎన్ని అనేది నేటికీ స్పష్టత లేదు. దీంతో డిఎఎస్‌సి ఉంటుందా లేదా అనే అనుమానం కలుగుతోంది. ప్రభుత్వం పోస్టుల భర్తీపై స్పష్టత ఇచ్చి, నోటిఫికేషన్ విడుదల చేయాలి.

- జామి పృథ్వీరాజ్, హిరమండలం, శ్రీకాకుళం జిల్లా

మాలాంటి పేదలతో ఆడుకోవద్దు



అధికారంలోకి వచ్చిన వెంటనే డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసి, మెగా డిఎస్‌సి నిర్వహిస్తామని చెప్పి ఆరు నెలలైంది. జగన్మోహన్ రెడ్డి లాగా ఈ కూటమి ప్రభుత్వం కూడా ఏదో ఒక కారణం చెప్పి వాయిదా వేస్తూ వస్తుంది. ఇప్పటికే అవనిగడ్డ వెళ్లి కోచింగ్ తీసుకున్నాం. సిలబస్ మార్పు చేస్తూ మాతో ప్రభుత్వాలు ఆడుకుంటున్నాయి. సిలబస్ మారిన ప్రతి సారి కోచింగ్ తీసుకోవడం అంటే మా లాంటి పేదవారికి ఎలా సాధ్యం? ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలి.

- మేరి రాణి, వేపాడ, విజయనగరం జిల్లా



గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

గ్రూప్-2 పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

సందేహాల నివృత్తికి కంట్రోల్‌రూమ్ : జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరం

ఎపిపిఎస్‌సి ఆధ్వర్యంలో ఈనెల 23న జరిగే గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, అభ్యర్థుల కోసం జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై కోఆర్డినేటింగ్ అధికారులు, లైజనింగ్ అధికారులు, ఛీఫ్ సూపరింటిండెంట్లుతో కలెక్టరేట్ లో గురువారం సమీక్ష నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖలు చేస్తున్న ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, గ్రూప్ 2 పరీక్షల నిర్వహణకు ఎటువంటి లోపాలు లేకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని, నిబంధనలన్నీ ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఛీఫ్ సూపరింటిండెంట్లదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు. 23వ తేదీ ఉదయం 10 నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5.30 వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. దీనికోసం విజయనగరంలోనే మొత్తం 12 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆరోజు పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని, పటిష్టమైన పోలీసు బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకొనే విధంగా ఆర్‌టిసి బస్సులు నడపాలని సూచించారు. అభ్యర్థులు మినహా ఇతరులను ఎట్టి పరిస్థితిలోనూ పరీక్షా కేంద్రాలలోకి అనుమతించకూడదని స్పష్టం చేశారు. ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్రటరీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ, అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్‌తోపాటు ఏదైనా ఫొటోతో ఉన్న గుర్తింపుకార్డును తీసుకురావాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అభ్యర్థుల మినహా ఇతర వ్యక్తులు, కెమేరాలకు అనుమతి లేదన్నారు. కంట్రోలు రూమ్ ద్వారా అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేస్తామని చెప్పారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, లైజనింగ్ అధికారులు, ఛీఫ్ సూపరింటిండెంట్లు, ఎపిపిఎస్‌సి ప్రతినిధులు డి.మల్లిఖార్జునరెడ్డి, డి.నాగభూషణం, టి.నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ : 08922 236947

ఎపిపిఎస్‌సి అధికారుల సెల్ నెంబర్లు

కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ సెక్రటరీ : 9014550855

డి.మల్లిఖార్జునరెడ్డి, ఎస్ఒ : 7670900914

డి.నాగభూషణం, ఎస్ఒ : 8008165065

టి.నందగోపాల్, ఎఎస్ఒ : 7561811601

ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



కమిషనర్‌కు వినతి అందిస్తున్న మున్సిపల్ యూనియన్ నాయకులు

ఆప్కాస్‌ను రద్దు చేస్తూ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకొని మొత్తం మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతూ గురువారం మున్సిపల్ కమిషనర్ నల్లనయ్యకు గురువారం కార్మికులు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు ఎ.జగన్మోహన్రావు బి.భాస్కరరావు నాయకులు రజిని , కృష్ణ, చిన్ని , శ్రీను,రాఘవ , మజ్జు, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి • పలుచోట్ల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, మండలిలో ఉత్తరాంధ్ర వాణిని వినిపిస్తానని యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. గురువారం ఆమె అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం, మాకవరపాలెం మండలాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఉపాధ్యాయులను కలిసి ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. తాను సామాన్య కుటుంబం నుంచి వచ్చానని, సుదీర్ఘకాలం ఉపాధ్యాయ ఉద్యమంలో ఉన్నానని, అందరి సాధకబాధకాలు తెలుసునని అన్నారు. ప్రస్తుతం చట్టసభల్లో పేదలు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రస్తావించే వారు కరువవుతున్నారన్నారు. తాను గెలిస్తే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల వాణిని కౌన్సిల్‌లో బలంగా వినిపించగలనని, పోరాడగలనని చెప్పారు. సిపిఎస్, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్న యాప్‌ల రద్దుకు కృషి చేస్తానన్నారు. ఆమె వెంట జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె.త్రిమూర్తులు రెడ్డి, యుటిఎఫ్ నాయకులు చిట్టయ్య, మోహన్, గాయత్రి, సిఐటియు నాయకులు అడిగర్ల రాజు ఉన్నారు.




ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి

విజయగౌరిని గెలిపించండి : బాబురెడ్డి


గుర్ల, చీపురుపల్లి : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ, అధ్యాపకులు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరిని గెలిపించాలని ఫ్యాప్టో పూర్వ చైర్మన్ పి.బాబురెడ్డి కోరారు. గురువారం గుర్ల, గరివిడి, చీపురుపల్లి, మెరకముడిదాం మండలాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులను, అధ్యాపకులతో సమావేశమై పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఉద్యమ అభ్యర్థి విజయగౌరి గెలిస్తేనే ఉపాధ్యాయుల గళం శాసనమండలిలో వినిపిస్తుందన్నారు. సిపిఎస్ రద్దు కోసం, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే ఉపాధ్యాయులు అందరూ పిడిఎఫ్ పక్షాన నిలిచారన్నారు. ఈ మద్దతు 27న జరగనున్న ఎన్నికల్లో విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. గతంలో పని చేసిన 14 మంది పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నీతి నిజాయితీతో పని చేశారని గుర్తు చేశారు. అదే కోవలో ఉపాధ్యాయుల సమస్యలను గొంతెత్తి ప్రశ్నించే అభ్యర్థి విజయగౌరిని అని చెప్పారు.

ఈ ప్రచారంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు మీసాల అప్పలనాయుడు, జిల్లా కార్యదర్శి ముదునూరు రఘునాధరాజు, రాష్ట్ర కౌన్సిలర్ ఆలమూరు సత్యశ్రీనివాస్, మెరకముడిదాం మండల అధ్యక్షులు మజ్జి హరికృష్ణ, గుర్ల మండల అధ్యక్ష కార్యదర్శులు పి.శ్రీనివాస్, హరిమోహన్, అండలూరి సత్యానందం, మురళీ, మురళీ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్, ఎం.వెంకీ, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఫ్యాప్టో మాజీ చైర్మన్ బాబురెడ్డి

శివరాత్రి జాతర ఏర్పాట్లు పరిశీలన



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌డిపిఒ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పుణ్యగిరిలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను, ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను విజయనగరం జిల్లా ఎస్‌డిపిఒ ఎం.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. శృంగవరపుకోటలో ఎమ్మెల్యే ఎన్నికల పోలింగ్ బూత్, పుణ్యగిరిలో మహాశివరాత్రి బందోబస్తు ఏర్పాట్ల గురించి, ముందస్తుగా చేపట్టబోయే చర్యలపై స్థానిక పోలీసు అధికారులతో చర్చించారు. ఎస్.కోట పోలీసులతో కలిసి పుణ్యగిరి క్షేత్రం, పార్కింగ్ స్థలాలను పరిశీలించి, సూచనలు చేశారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి కేసులలో తొందరగా పురోగతి ఉండాలని తగు సూచనలు చేశారు.

నెల్లిమర్ల : ఈ నెల 26, 27తేదీల్లో రామతీర్థంలో జరగనున్న శివరాత్రి జాతర బందోబస్త్‌పై భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ గురువారం పరిశీలించారు. శివరాత్రి రోజున బందోబస్తు, పార్కింగ్ ఏరియాలో క్యూ లైన్‌లో ఎలా ఉండాలి ట్రాఫిక్ రెగ్యులేషన్ వంటి వాటిపై దేవదాయ అధికారులతో కలిసి చర్చించారు. జాతర రోజున భక్తులకు అసౌకర్యం కలగకుండా పోలీస్ శాఖ తరపున బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ప్రజలు పోలీసు సూచనలు సలహాలు పాటిస్తూ సహకరించాలని కోరారు. సిఐతో బాటు స్థానిక ఎస్ఐ బి.గణేష్ పాల్గొన్నారు.

'వాట్సప్ గవర్నెన్స్'పై విస్తృత ప్రచారం

- 9552300009 వాట్సప్ నెంబరు ద్వారా ప్రభుత్వ సేవలు పొందవచ్చు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్
- 8 నుంచి జిల్లాలో అత్యంత నిరుపేదల గుర్తింపు : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఆధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో మొబైల్ ద్వారానే ఇంటి వద్ద నుంచి అత్యంత సులువుగా ప్రభుత్వ సేవలు పొందేందుకు వీలుగా రూపొందించిన వాట్సప్ గవర్నెన్స్ ను వినియోగించుకునేలా ప్రజల్లో విస్తృత అవగాహన కలిగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రస్తుతం 9552300009 వాట్సప్ నెంబరు ద్వారా 158 రకాల ప్రభుత్వ సేవలు, ధ్రువపత్రాలు అందజేస్తున్నామని, రానున్న రోజుల్లో వెయ్యి సేవలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లతో గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో పలు అంశాలపై సమీక్షించారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం ప్రజా భాగస్వామ్యంతో చేపడుతున్న పి-4 కార్యక్రమాన్ని మార్చి 30న ప్రారంభించనున్నట్టు వెల్లడించారు.

జిల్లాలో మార్చి 8 నుంచి పి-4 సర్వేకు ఏర్పాట్లు

జిల్లాలో అత్యంత నిరుపేదల గుర్తింపుకోసం మార్చి 8 నుంచి సర్వే చేపట్టేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. మార్చి 6న జిల్లా అధికారులతో దీనిపై సమావేశం నిర్వహించనున్నామని, మార్చి 7న మండల స్థాయిలో ఎంపిడిఒల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు. మార్చి 8న జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఈ కార్యక్రమంపై చర్చిస్తామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, ముఖ్య ప్రణాళిక అధికారి పి.బాలాజీ, డిఇఒ మాణిక్యం నాయుడు, డిపిఒ వెంకటేశ్వరరావు, డిఎస్ఒ మధుసూదనరావు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాధుడు, ఆర్‌టిసి డిపో మేనేజర్, ఇంటర్మీడియెట్ బోర్డు ఆర్ఐఒ తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ చేస్తే.. సైలెన్సర్ లేపేస్తాం

250 సైలెన్సర్లను ధ్వంసం చేసిన పోలీసులు

ప్రజాశక్తి-విజయనగరంకోట



సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న రోడ్డు రోలర్

వాహనాలకు సైలెన్సర్లను మార్పు చేయడం చట్టరీత్యా నేరమని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లాలో ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న 250 సైలెన్సర్లను సీజ్ చేసి, వాహనదారులకు ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమానా విధించారు. ఈ సైలెన్సర్లను గురువారం ట్రాఫిక్ పోలీసులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఇటీవల కాలంలో యువత తమ ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లను మార్పులు చేస్తూ, పెద్ద శబ్దాలతో ఇతర వాహనదారులను, ప్రజలను, పాదచారులను, పిల్లలను, హృద్రోగులను భయ భ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. వీటిని నియంత్రించేందుకు గత ఆరునెలల్లో ట్రాఫిక్ పోలీసులు నగరంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఇండోర్, పంజాబ్, రాకెట్ పేరుతో అమర్చిన 250 సైలెన్సర్లను మెకానిక్ సహకారంతో తొలగించామన్నారు. వీటిని అమర్చినందుకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున రూ.2.50లక్షలు జరిమానా విధించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలను సైలెన్సర్లను అమర్చడం, కంపెనీ ఇచ్చిన వాటిని తొలగించడం, మార్పు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. వీటిని మళ్ళీ వాహనదారులు వినియోగించకుండా రోడ్డు రోలర్ తో ధ్వంసం చేసే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. వాహనదారులు రహదారి భద్రతను పాటించాలని, వాహనాలను అతివేగంగా నడవకూడదని, హెల్మెట్స్ ధరించాలని, ట్రిపుల్ రైడింగు చేయకూడదని తెలిపారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డి.మణికుమార్, ట్రాఫిక్ సిఐ సూరినాయుడు, ఎస్‌బి సిఐలు లీలారావు, ఆర్.వి.ఆర్.కె చౌదరి, 1వ పట్టణ సిఐ ఎస్.శ్రీనివాస్, 2వ పట్టణ సిఐ టి.శ్రీనివాసరావు, ఎం.వి.ఐ. మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ట్రైసైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎస్ఎల్‌పిజి కంపెనీ ప్రతినిధులు

వికలాంగులకు సేవ చేయడం గొప్ప విషయం

ప్రజాశక్తి-కొత్తవలస

వికలాంగులకు సేవలందించడంలో గురుదేవ్ ట్రస్ట్ ముందు ఉండడం గొప్ప విషయమని వక్తలు కొనియాడారు. గురువారం శ్రీగురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సౌత్ ఆసియా ఎల్‌పిజి కంపెనీ ప్రయివేట్ లిమిటెడ్ సహకారంతో కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ఎస్ఎల్‌పిజి సిఇఒ నవీన్ మఖిజ, సిఎఫ్ఒ వికాస్ వర్మ, సిఎస్ఆర్ హెడ్ రామనాథ్ ముందుగా విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్ కేన్సర్ హాస్పిటల్‌ను సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్ చేస్తున్న సేవలను అభినందించారు. అనంతరం సాల్పజి సహకారంతో హాస్పిటల్‌కు అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్సును సిఎస్ఆర్ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్, వైస్ ఛైర్మన్ వి.ఫణీంద్ర, ట్రస్ట్, హాస్పిటల్ బృందం పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి శిక్షణతో పిల్లలకు పునాది

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జ్ఞాన జ్యోతి శిక్షణతో పిల్లలకు పునాది స్థాయిలో విద్య అందిస్తామని ఎంఇఒలు యుఎస్ఎన్ మూర్తి, ఈపు విజయ్ కుమార్ అన్నారు. గురువారం జరజాపుపేట జడ్‌పి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జ్ఞాన జ్యోతి 120రోజుల శిక్షణా కార్యక్రమంలో ఎంఇఒలు పాల్గొని మాట్లాడారు. అంగన్ వాడీలు జ్ఞాన జ్యోతి శిక్షణలో నేర్చుకున్న అంశాలు ప్రీ స్కూల్ పిల్లలకు విద్యలో పునాది వేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిడిపిఒ, అంగన్వాడీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

మెరక ముడిదాం: ఆటపాటలతోనే విద్యార్థులకు విద్యాభివృద్ధి సాధ్యమని ఎంఇఒలు చంద్రశేఖర్, ధర్మ శ్రీను అన్నారు. జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీల ఏర్పాటు చేసిన వివిధ రకాల చార్టులు, టిఎల్ఎంతో సృజనాత్మక కృత్యాలను వారు పరిశీలించారు. ఈ శిక్షణకు డిఆర్‌పిలుగా ఎం.రమేష్, ఏ.చంద్రశేఖర్, కెవి కామేశ్వరరావు, టి.శ్రీధర్, లక్ష్మి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని సిడిపిఒ సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి- రాజాం

మండలంలోని గురవం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక కేంద్రాన్ని గురువారం ఎంపిడిఒ శ్రీనివాసరావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జీరో నుండి ఆరు సంవత్సరాల పిల్లలు బయోమెట్రిక్ అప్డేట్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు. సిబ్బంది సమయానికి హాజరై ప్రజలకి సకాలంలో సేవలు అందించాలని చెప్పారు. అనంతరం గ్రామంలోని ఎస్‌డబ్ల్యుపి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బీమా విభాగంలో జిఎస్‌టిని తొలగించాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

బీమా విభాగంలో జిఎస్‌టిని తొలగించాలని ఐసిఇయు బేస్ యూనిట్ ప్రెసిడెంట్ టి.జగన్నాథం డిమాండ్ చేశారు. స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద గురువారం మూడు, నాలుగు తరగతుల ఉద్యోగులు గంటపాటు వాకౌట్ స్ట్రైక్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఐసిలో మూడు, నాలుగు తరగతుల ఉద్యోగుల నియామకం చేపట్టాలన్నారు. వీరి ఆందోళనకు ఎల్ఐసి ఏజెంట్లు, సిబ్బంది సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కె.శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం


ప్రజాశక్తి - నెల్లిమర్ల

కొండవెలగాడ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ అంతరాయం కలగనుందని డిఇఇ పి.త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండ వెలగాడ 33/11/ కెవి సబ్ స్టేషన్ పరిధిలో కొండవెలగాడ ఎస్ఎస్‌హెచ్ క్యూ ఫీడర్, పారసాం 11 కెవి రూరల్ ఫీడర్, తాళ్లపూడిపేట 11కెవి రూరల్ ఫీడర్ లైన్ కింద చెట్టుకొమ్మలు తొలగించడం, సాంకేతిక సమస్యలు వాటిని సరి చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు కొండవెలగాడ, చంద్రంపేట, తాళ్ల పూడి పేట, టెక్కలి, ఎల్ఎన్‌పురం, తుమ్మలపేట, చిన బూరాడపేట, పారసాం, గెద్ద పేట, పెదబూరాడపేట, గుర్ల మండలంలోని భూపాలపురం, ఆనందపురం గ్రామాలకు విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదార్లు సహకరించాలని ఆయన కోరారు.

నిరుద్యోగ సంఘ అధ్యక్షులుగా నాగులపల్లి

ప్రజాశక్తి - గుర్ల

నియోజకవర్గ నిరుద్యోగ సంఘ అధ్యక్షులుగా నాగులపల్లి నారాయణరావును నియమిస్తూ రాష్ట్ర నిరుద్యోగ సంఘ అధ్యక్షులు ఎస్.కుమార్ నియామక పత్రాన్ని గురువారం అందజేశారని నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యపై అలుపెరుగని పోరాటం చెయ్యాలని రాష్ట్ర అధ్యక్షులు సూచించినట్లు తెలిపారు. నియోజకవర్గ నిరుద్యోగ సంఘానికి అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులకు ధన్యవాదాలు తెలిపారు. నిరుద్యోగ సమస్యలపై పోరాటం చేసి నిరుద్యోగలకు న్యాయం జరిగే విదంగా కృషి చేస్తానని నారాయణరావు చెప్పారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

వైభవంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం గ్రామంలో ముత్యాలమ్మ తల్లి ఆలయ నాలుగో వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ముత్యాలమ్మను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, బుచ్చి రాంప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆమె సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి దాసరి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం

ప్రజాశక్తి-బొబ్బిలి

పారిశుధ్య నిర్వహణలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పట్టణంలో గురువారం అపారిశుధ్యంగా ఉన్న చెత్త కుప్పను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనుల్లో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా ఉండడంతో జిల్లాకు 24వ స్థానం వచ్చిందన్నారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర సాధిస్తామంటున్న పాలకులు ఫొటోలకు మాత్రమే పరిమితం అవుతున్నారని విమర్శించారు.. పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు.

పథకాల అమలుపై జిల్లాకు ర్యాంకులు

మద్యం దుకాణాలు, ఘన వ్యర్థాల, ఆర్‌టిసి బస్‌స్టేషన్ల నిర్వహణలో జిల్లాకు ఉత్తమ ర్యాంకు

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, వివిధ శాఖల ద్వారా అందుతున్న సేవలపై వివిధ మార్గాల ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయాల ప్రకారం ఆయా జిల్లాలకు ఆయా అంశాల్లో వచ్చిన ర్యాంకులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ప్రకటించారు. గురువారం జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఒక్కో శాఖకు సంబంధించి పలు అంశాలపై ప్రజలు ఐవిఆర్ఎస్ విధానంలో, క్యూఆర్ కోడ్ ద్వారా, వాట్సాప్ ద్వారా ఇచ్చిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా ఆయా జిల్లాలకు ర్యాంకులు ప్రకటించామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చెప్పారు. ఘన వ్యర్థాల నిర్వహణలో విజయనగరం జిల్లా రెండో స్థానం లభించిందని తెలిపారు.



విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు

మద్యం షాపుల నిర్వహణకు సంబంధించి ప్రజల్లో సంతృప్తి శాతం అధికంగా ఉన్నట్లు అభిప్రాయం రావడంతో జిల్లాల్లో విజయనగరం మొదటి స్థానంలో నిలిచిందని ప్రకటించారు. ఆస్పత్రుల సేవలకు సంబంధించి జిల్లా ఐదో స్థానంలో నిలిచింది. ఆస్పత్రిలో డాక్టర్, సిబ్బంది అందుబాటులో ఉన్నారా, డాక్టర్, సిబ్బంది ప్రవర్తన ఎలా ఉంది, మీకు ఆస్పత్రిలో రాసిన మందులు ఇచ్చారా, మిమ్మల్ని ఎవరైనా డబ్బులు డిమాండ్ చేశారా, ఆస్పత్రి పరిశుభ్రంగా ఉందా వంటి అంశాల్లో వచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఈ ర్యాంకు ప్రకటించారు.

ఆర్‌టిసి బస్ స్టేషన్ల నిర్వహణలో విజయనగరం జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచినట్లు చీఫ్ సెక్రటరీ వెల్లడించారు. బస్ స్టేషన్‌లో పరిశుభ్రత, సీటింగ్, వెయిటింగ్ ప్రాంతాల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల సౌకర్యం, బస్‌స్టేషన్‌లో బస్సు షెడ్యూల్, రూట్లు గురించిన సమాచారం స్పష్టంగా ప్రదర్శించబడుతోందా? అంశాలపై అభిప్రాయాలను సేకరించారు.

దీపం-2 పథకం ద్వారా గ్యాస్ సిలిండర్ల సరఫరా అంశంలో జిల్లాకు రాష్ట్రంలో ఐదో ర్యాంకు, రేషన్ సరుకుల పంపిణీలో జిల్లాకు 15వ స్థానం, ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సంబంధించి ఏడో ర్యాంకులో లభించాయి.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సంబంధించి ఎఫ్-లైన్ దరఖాస్తుల పరిష్కారంలో జిల్లా 18వ స్థానంలోనూ, అన్న క్యాంటీన్ల నిర్వహణలో 25వ స్థానంలోనూ నిలిచినట్లు నివేదికలో వెల్లడించారు. ఆయా జిల్లాలు ఈ నివేదికల ఆధారంగా రానున్న రోజుల్లో ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని, తమ సేవలను మరింతగా మెరుగు పరచుకొని ఉత్తమ సేవలు అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించారు. జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయా జిల్లా అధికారులకు నివేదికలు అందజేసి తమ శాఖ పనితీరును మెరుగుపరచుకోవాలని ఆదేశించారు.

ప్లాస్టిక్ సంచులను వాడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో ప్లాస్టిక్ సంచులను అమ్మినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి హెచ్చరించారు. కమిషనర్ ఆదేశాలతో శానిటేషన్ సిబ్బంది పట్టణంలో షాపులను గురువారం తనిఖీ చేశారు. ప్లాస్టిక్ సంచులను సీజ్ చేశారు. చెలికాని సీతయ్యమ్మ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో కూరగాయల వ్యాపారి వద్ద నుంచి 25 కిలోలు, కిరాణా వ్యాపారి నుంచి 30 కిలోల ప్లాస్టిక్ సంచులను సీజ్ చేసి, జరిమానా విధించారు. పాన్ షాపులను తనిఖీ చేసి, ప్లాస్టిక్ సంచులను సీజ్ చేసి, జరిమానా విధించారు. ప్లాస్టిక్ సంచులను సీజ్ చేసిన శానిటేషన్ సిబ్బందిని కమిషనర్ రామలక్ష్మి అభినందించారు.

అంగన్వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమం మూడో రోజు గురువారం కొనసాగింది. అంగన్వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు ఇస్తున్న పోషకాహారాన్ని క్రమం తప్పకుండా అందజేయాలని ఎంఇఒ పి.బాలభాస్కరరావు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వల్లి, అంగన్వాడీ సూపర్వైజర్లు కావేరి, భాగ్యవతి, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

ఎల్ఐసి క్లాస్ 3, 4 ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

ఎల్ఐసి ఉద్యోగులు డిమాండ్ ● బోజన విరామ సమయంలో నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎల్ఐసి ఆఫ్ ఇండియాలో బేస్ క్యాడర్ అయిన క్లాస్ 3, 4 ఉద్యోగ నియామకాలు వెంటనే చేపట్టాలని, ఎల్ఐసిలో అతి పెద్ద యూనియన్ అయిన ఎఐఐఇఎను గుర్తించాలని కోరుతూ ఉద్యోగులు గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎల్ఐసి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలు, ఐఆర్‌డిఎఐ నేల విడిచి చేస్తున్న సంస్కరణల పరంపరలో ఎల్ఐసి మేనేజ్‌మెంట్ సంస్థ భవిష్యత్తుకు కావాల్సిన యంత్రాంగాన్ని సమకూర్చడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. అంతే కాకుండా క్లాస్ త్రీ మరియు క్లాస్ ఫోర్ ఉద్యోగాల నియామకాల పట్ల పూర్తిగా అలక్ష్యం ప్రదర్శిస్తున్నదని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ పరిరక్షణే ధ్యేయంగా ఎఐఐఇఎ పోరాడుతోందని తెలిపారు. వెంటనే ఎల్ఐసిని నిర్వీర్యం చేసే ఆలోచనను మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బేస్ యూనిట్ అధ్యక్షులు ఎస్.తిరుమలరావు, సెక్రటరీ ఆర్.అప్పలనాయుడు, జాయింట్ సెక్రటరీ డిఎస్ ప్రసాద్, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నాయకులు వి. జగన్నాధ స్వామి, ఎం.శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఐసి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ



మాట్లాడుతున్న ఎడి భానులత

ప్రజాశక్తి-గజపతినగరం

భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగంపై మండలంలోని కొత్త శ్రీరంగరాజపురంలో రైతులకు వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. జిల్లా భూసార పరీక్ష కేంద్రం ఎడి భానులత, వ్యవసాయ శాఖ ఎడి కె.మహారాజన్ మాట్లాడుతూ రైతులు తమ భూమిలో మట్టి నమూనా సేకరించే పద్ధతి, పోషక లోపాలు, వాటి యాజమాన్యం గురించి తెలిపారు. కారిచౌడు నేలలో జీలుగ, జనుము వేసుకొని సవరించుకోవచ్చని తెలిపారు. నత్రజని ఎరువు మాత్రమే కాకుండా సమగ్ర పోషక యాజమాన్యం చేపట్టి అధిక దిగుబడులను పొందాలని సూచించారు. నేలలో సేంద్రియ కర్బన శాతం తగ్గుతుందని, దానిని సవరించేందుకు రైతులు పచ్చిరొట్ట ఎరువులు, గెత్తం లాంటివి వినియోగించాలని చెప్పారు. అవసరం మేరకు యూరియా వినియోగించడం వల్ల నేల, వాయు, నీటి కాలుష్యం తగ్గుతాయన్నారు. వ్యవసాయాధికారులు చంద్రకళ, సిహెచ్ ధనలక్ష్మి మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల కార్డు ఆధారంగా రైతులు తమ నేలలో పోషక లోపాలను ఎలా తెలుసుకోవాలి, ఎరువులు ఎలా, ఏ పరిమితిలో వాడాలో తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడపునాయుడు, విఎఎ వినయ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళికతో క్షయ నిర్మూలన

ప్రజాశక్తి-రామభద్రపురం

వంద రోజుల ప్రణాళిక ద్వారా ప్రభుత్వం క్షయవ్యాధి నిర్మూలనకు చేస్తున్న కృషి సత్ఫలితాలు ఇస్తుందని బాడంగి, రామభద్రపురం సబ్ యూనిట్ క్షయ వ్యాధి నివారణాధికారి శ్రీదేవి తెలిపారు. స్థానిక పిహెచ్‌సిలో ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యాధి లక్షణాలు గుర్తించడం, దానికి అందుబాటులో ఉన్న పరీక్షలు నిర్వహించడం ద్వారా టిబి వ్యాధి నిర్మూలనపై ప్రచారం చేపడుతున్నట్లు వివరించారు. బొబ్బిలి సిహెచ్‌సి, రామభద్రపురం పిహెచ్‌సి పరిధిలో ఉన్న 42 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో జనభాగిదారీ సదస్సులు నిర్వహించి, 41,324 కు పైగా ఉలనరబుల్ పాపులేషన్ స్క్రీనింగ్ పరీక్షలు, 2209 మందికి ట్రూనాట్ ద్వారా కఫం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఐఎంఎ కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా వ్యాధి నిర్ధారణకు ప్రయివేటు ఎక్స్‌రే కేంద్రాల సహకారంతో 1460 మందికి ఉచితంగా ఛాతి ఎక్స్‌రేలు తీశామన్నారు. వచ్చే నెల 17వ తేదీ వరకు విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. చాలా ప్రాంతాల్లో టీబీ ప్రచారంలో భాగంగా క్షయవ్యాధి చికిత్సలు తీసుకుంటున్న వారికి ప్రత్యేక ఫుడ్ బాస్కెట్లలో పౌష్టికాహారం అందిస్తున్నామని వెల్లడించారు. ప్రతిఒక్కరూ క్షయ వ్యాధిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఫుడ్ బాస్కెట్లు పంపిణీ చేశారు.

వేపాడ : ఎన్‌టిఇపి కార్యక్రమంలో భాగంగా బొద్దాం పిహెచ్‌సిలో క్షయ రోగులకు వైద్యాధికారి పి.శివాని పోషకాహార బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎస్ పిఎస్ఆర్ మూర్తి, సిహెచ్ఒ పాల్గొన్నారు.

డెంకాడ : మండలంలోని మోపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో టిబి 100 రోజులు అవగాహన కార్యక్రమంలో భాగంగా టిబి మందులు వాడుతున్న రోగులకు గురువారం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పివివి యోగితాబాల చేతులు మీదుగా పోషకాహార ఫుడ్ బాస్కెట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శరణ్య, హెల్త్ సూపర్ వైజర్ యస్.సూరిబాబు, హెచ్‌వి రెహ్మత్ ఉన్నిసా, ఎన్ఎం రమణమ్మ, పి.సన్యాసమ్మ, ఎంఎల్‌హెచ్‌పి గౌరీ, ఆశా కార్యకర్త మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



రామభద్రపురంలో పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న క్షయ నివారణాధికారి శ్రీదేవి

పాఠశాలల ఆకస్మిక సందర్శన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డిప్యూటి డిఇఒ కెవి రమణ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల హాజరు, అభ్యాసన, అడిగి తెలుసుకున్నారు. 10వతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కీలకమైన సబ్జెక్ట్‌ల మీద బోధనా అంశాలు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని శత శాతం ఉత్తీర్ణ సాధించడానికి కృషి చేయాలన్నారు. పరీక్షలంటే భయపడకుండా రాస్తే అనుకున్న ఫలితాలు వస్తాయని ధైర్యం చెప్పారు. కాగా నాణ్యమైన మధ్యాహ్నం భోజనం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సి.హెచ్. ఆనందమూర్తి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం : రాజాం నగర పంచాయతీ పరిధిలోని డోలాపేట పాఠశాలను ఎంఇఒ దుర్గాప్రసాద్ గురువారం సందర్శించి తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నం పెడుతున్న భోజన మెనూ అమలు తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్నం పూట పెడుతున్న భోజనం సక్రమంగా నిర్వాహకులు వండి పెట్టాలన్నారు. దీనిపై ఎప్పటికప్పుడు స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామభద్రపురం : పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు కీలకమని ఎంఇఒ తిరుమల ప్రసాద్ అభిప్రాయ పడ్డారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రీ ఫైనల్ పరీక్షల నిర్వహణను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలకు సమాంతరంగా ఇవి అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తున్నామని, దీనివల్ల పరీక్షల ఫోబియో పోతుందని చెప్పారు. ముందుగా తెలిసిన జవాబులు రాసి తర్వాత కష్టమైన జవాబులు ఆలోచించి రాయాలని సూచించారు. విద్యార్థులు ప్రశ్నల నంబర్లను విధిగా వేసే అలవాటు చేసుకోవాలన్నారు. పేపర్ల మూల్యాంకనానికి అనువుగా ఉండేందుకు చక్కని దస్తూరితో రాయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు నాగభూషణరావు, పాఠశాల కార్యదర్శి ప్రభాకర్ రావు, మురళీధర్ రావు, ఉపాధ్యాయులు దాలి నాయుడు, జయ, శాంతికుమారి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న డిడిఇఒ రమణ

ఉపాధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి-బాడంగి

ఉపాధి హామీ పనులపై స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎంపిడిఒ రామకృష్ణ సమీక్షించారు. ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడి, పలు సూచనలు చేశారు. కూలీలకు కచ్చితంగా రూ.270 నుండి రూ.280 వచ్చేటట్లు చూడాలని క్షేత్ర, సాంకేతిక సహాయకులను ఆదేశించారు. ఫారం పాండ్స్ పంచాయతీకి కనీసం నాలుగైనా గుర్తించి పని ప్రారంభించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న గోకులాలను వెంటనే పూర్తిచేయాలని చెప్పారు. పని ప్రాంతాల్లో మజ్జిగ, తాగునీరు, టెంట్లు ఏర్పాటుచేయాలని సూచించారు. వ్యక్తిగత ఇంకుడు గుంతలు ఈ నెలాఖరికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడా మస్తర్లలో దిద్దుబాటు ఉండకూడదని చెప్పారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ రామకృష్ణ

ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు

ప్రజాశక్తి-రామభద్రపురం

ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు, కేసులు నమోదు చేస్తామని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్చి ఒకటో నుంచి నిబంధనలు కఠినంగా అమలు చేసే దిశగా పోలీసు, రవాణా శాఖలు సిద్ధంగా ఉన్నాయన్నారు. మోటారు వాహన చట్టం ప్రకారం హెల్మెట్, సీటు బెల్టులు తప్పనిసరిగా ధరించాలన్నారు. లేదంటే భారీ స్థాయిలో జరిమానాలు.. శిక్షలు విధించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇకపై ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతామంటే కుదరదని, అన్నిరకాల ధ్రువపత్రాలు ఉండాలని స్పష్టంచేశారు.జరిమానాలు పటిష్టంగా అమలు చేసేందుకు పోలీసు, రవాణా శాఖలు సంయుక్తంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. దీనిపై తమ సర్కిల్ పరిధిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తశుద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-బొబ్బిలి

కృష్ణాపురం రోడ్డులో ఉన్న మున్సిపల్ పాత డంపింగ్ యార్డులో చెత్తశుద్ధి పనులను ప్రారంభించారు. 4.10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పాత డంపింగ్ యార్డులో 14,711 మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. చెత్తను బయో మైనింగ్ చేసేందుకు స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్.. మెస్సర్స్ తరుణి అసోసియేట్ సంస్థకు అప్పగించింది. రోజుకు 160 టన్నుల చెత్తను ప్రాసెస్ చేసి ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర వ్యర్థాలను విశాఖలోని జిందాల్ పవర్ ప్లాంట్‌కు పంపించి, మట్టిని లోతట్టు ప్రాంతాల్లో వేయనున్నారు. చెత్తశుద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి గురువారం పరిశీలించారు. చెత్త ప్రాసెస్‌పై ఏజెన్సీ సిబ్బందికి కమిషనర్ పలు సూచనలు చేశారు.



చెత్తశుద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రామలక్ష్మి

22న కవితా సంపుటి ఆవిష్కరణ సభ

ప్రజాశక్తి-విజయనగరం

బరంపురం సాహితీ సంస్థ వికాసం తరపున ఈనెల 22న సాయంత్రం 6గంటలకు బరంపురంలోని ప్రకాశం హాలులో రొక్కం కామేశ్వరరావు 9వ కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరగనుందని విశాఖ రచయితల సంఘం సభ్యులు అడపా రామకృష్ణ తెలిపారు. ఈ కవితా సంపుటిని వల్లూరి శివప్రసాద్ సమీక్షిస్తారని, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ పాల్గొంటారని తెలిపారు. ఇటీవల రొక్కం కామేశ్వరరావు అంతర్ముఖం తెలుగు కవితా సంపుటి ఆంగ్ల అనువాదానికి 2024 సంవత్సరానికి గాను పొయిట్ ఆఫ్ ది ఇయర్ అవార్డును యుకియోటో లిటరరీ సంస్థ ద్వారా కలకత్తాలో అందుకున్నారని తెలిపారు.

నేడు ఎల్ఆర్ఎస్‌పై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఎల్ఆర్ఎస్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసున్న వారంతా ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయానికి చేరుకోవాలని ఆమె కోరారు

ఏడుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల పరిధిలోని కొత్తరేగలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. గ్రామంలో పశు వులశాల వద్ద పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేసినట్లు చెప్పారు. ఏడుగురిని అదుపులోకి తీసుకొని, రూ.7020 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

10 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-జామి

మండలంలోని జాగరం గ్రామంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ ఇందిరాదేవి ఆధ్వర్యాన ఎస్ఐ రాజశ్రీ, సిబ్బంది గురువారం దాడులు చేపట్టారు. పాక ఎర్నిబాబును అరెస్టు చేసి, 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో హెచ్‌సి ఎం.రాంబాబు, ఇసి విఎం నాయుడు పాల్గొన్నారు.